ప్రజాశక్తి
శుక్రవారం 25 అక్టోబర్ 2024 5
అనంతపురం



సకాలంలో స్పందించాం..

నష్టాన్ని నివారించాం..!

◆ఇళ్లు కోల్పోయిన వారికి 26న నష్టపరిహారం
◆నేరుగా బాధితుల ఖాతాల్లోకి డబ్బులు జమ
◆కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో అనుకోకుండా వచ్చిన వరదలపై సకాలంలో స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించాగలిగామని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ తెలియజేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు రోజుల క్రితం భారీ వర్షం, పై ప్రాంతాల నుంచి వరద నీరు అధికంగా రావడంతో పండమేరు పొంగిపొర్లు అనంతపురం శివారు ప్రాంతాలు జలమయం అయ్యాయన్నారు. ఈ సమయంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమై నీటిలో చిక్కుకున్న 110 కుటుంబాలను రెవెన్యూ అధికారులు, పోలీసులు కాపాడారని చెప్పారు. బాధిత కుటుంబాల కోసం మూడు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 375 మంది వరద బాధితులను అక్కడికి తరలించి భోజన సదుపాయం కల్పించామన్నారు. భోజనంతో పాటు నిత్యావసర వస్తువులనూ పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 456.92 హెక్టార్లలో వ్యవసాయ పంటలు నష్టమై రూ.2.66 కోట్లు, ఉద్యాన పంటలకు సంబంధించి 68.20 హెక్టార్లలో రూ.73.19 విలువజేసే నష్టం జరిగిందన్నారు. 40 సాధారణ ఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. రెండు పశువులు మృతి చెందాయన్నారు. రూ.10 లక్షల రూపాయల విలువగల 100 మేకలు మరణించాయన్నారు. వీటన్నింటి నష్టం అంచాన వేసి ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. ఇళ్ల నష్టానికి సంబంధించి ఈనెల 26వ తేదీన నష్టపరిహారాన్ని బాధితుల ఖాతాల్లో జమ చేస్తామని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటలకు సంబంధించి నష్టపరిహారాన్ని అంచనా వేయడంలో నియమ నిబంధనలు పాటించాల్సి ఉందని, ఆ మేరకు అధికారులు నష్ట నివేదికలు అందించిన తర్వాత వారికి కూడా నష్టపరిహారం అందజేస్తామన్నారు.

భైరవానితిప్ప ప్రాజెక్టు నుంచి 800 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోందన్నారు. చాగల్లు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. చిత్రావతి రిజర్వాయర్‌కు ఇంకా వరద నీరు రాలేదని, అయితే రిజర్వాయర్ నీటితో నిండిందన్నారు. హగరి, పెన్నా, చిత్రావతి, పండమేరు వంక పరివాహక ప్రాంతాల్లో ఇంకా వర్షం కురిస్తే నీరు పారుతుందని, ఈ విషయమై జిల్లాలో ప్రజలందరినీ అప్రమత్తం చేశామన్నారు. వర్షం వల్ల ఎలాంటి ఇబ్బంది వచ్చినా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రం సిద్ధంగా ఉందన్నారు. నడిమి వంక, మరువ వంక పైభాగాన ఉపాధి హామీ కింద నీటి సంరక్షణ పనులు (వాటర్ కన్జర్వేషన్ స్ట్రక్చర్స్) చేపట్టేందుకు ఒక సంవత్సరంలోపు చర్యలు తీసుకునేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ సమావేశంలో అనంతపురం ఆర్డీవో వసంతబాబు, డిపిఎం ఆనంద్, కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు గ్రహణం

◆ప్రభుత్వ ఆదేశాలతో రూ.50కోట్ల పనులకు బ్రేక్
◆ఇంజినీరింగ్ అధికారుల సమావేశంలో చర్చ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులకు మరోసారి గ్రహణం పట్టుకున్నట్లు కన్పిస్తోంది. ఈ ఏడాది అభివృద్ధి పనులకు సంబంధించి నిర్వహించిన టెండర్లు, పనులు అన్నింటినీ నిలిపేయాలంటూ ప్రభుత్వం నుంచి ఇటీవల ఒక ఉత్తర్వు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఉత్తర్వుతో దాదాపు రూ.50 కోట్లకు పైగా పనులు ప్రస్తుతానికి ఆగినట్లు సమాచారం. ఈ విషయంపై గురువారం నాడు మేయర్ ఛాంబర్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో పెద్ద ఎత్తున చర్చ జరిగింది. కమిషనర్, పాలకవర్గం సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చ జరిపారు. ప్రభుత్వ ఉత్తర్వులను సడలించి అత్యవసర అభివృద్ధి పనులను కొన్నింటినైనా చేయాలంటూ సభ్యులు సమావేశంలో కోరారు. టెండర్ గ్రాంట్ వర్కులు చేపట్టాలంటే ప్రభుత్వ అనుమతి పొంది చేపట్టాలా.. లేక స్థానికంగానే ప్రాధాన్యత పరంగా పనులు గుర్తించి చేపట్టాలా అన్న అంశంపైనా చర్చ జరిగింది.



అనంతపురం నగరంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్లు

అటకెక్కిన అభివృద్ధి పనులు

ప్రస్తుతం ఎక్కడికక్కడ నగరంలో అభివద్ధి పనులు అటకెక్కాయి. రహదారి ప్రధాన రహదారులన్నీ గుంతలమయం కావడంతో నగర ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత పాలకులు ఆర్భాటంగా వందల కోట్ల రూపాయల అభివద్ధి పనులు జరిగాయని ఇప్పటికీ ప్రకటనలు చేస్తూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలో అభివృద్ధి ఆ స్థాయిలో లేదంటూ టిడిపి నాయకులు విమర్శలు చేస్తున్నారు. సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, తిలక్‌రోడ్డు, గాంధీ బజారు, నీలంటాకీస్ సర్కిల్ ఇలా నగరంలోని ప్రధాన రహదారులన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయి. రహదారుల విస్తరణ అన్న మాట ప్రకటనలకే పరిమితం కావడంతో నగరంలో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. గుంతల మయంగా మారిన రహదారుల్లో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత పాలకవర్గ సభ్యులు గుంతలమయంగా మారిన రహదారులను ఎత్తిచూపుతూ సత్వరం గుంతలను పూర్తి చేసేందుకు కనీసం ప్యాచ్ వర్క్ అయినా చేపట్టాలంటూ ఉన్నతాధికారులకు సూచిస్తున్నారు.

గత ప్రభుత్వంలోనూ..

గత ప్రభుత్వ హయాంలో సైతం ఇదే రకంగా అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో ఎన్నికల ముందు నిర్వహించిన టెండర్ల అభివద్ధి పనులను నిలిపేస్తూ వైసిపి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. అప్పుడు కూడా అభివృద్ధి పనులకు తాత్కాలికంగా విఘాతం కలిగింది. అటు తర్వాత మంజూరు అయిన పనులు ఒక్కొక్కటిగా మొదలయ్యాయి. ఇప్పుడు మళ్లీ అదే సమస్య వచ్చినట్లు కన్పిస్తోంది.

పనులు చేయకుంటే నిధులు వెనక్కు.?!

అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధులకు సంబంధించి కొన్ని గ్రాంట్ వర్క్‌లు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. నిర్దేశిత గడువులోగా పనులు చేపట్టి పూర్తి చేయకుంటే నిధులు వెనక్కు వెళ్లే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుతో ఉన్న నిధులు కూడా వెనక్కు వెళ్లే ప్రమాదం ఉందనే భావన అధికారుల్లో వ్యక్తం అవుతోంది. ఈ పరిస్థితుల్లో ఏప్రిల్ మునుపు నిర్వహించిన జనరల్ ఫండ్ గ్రాంట్ పనుల సమాచారాన్ని క్రోడీకరించి జాబితా తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నం అవుతున్నారు. ఈ పనుల వివరాలు బహిర్గతం అయితే గానీ ప్రాధాన్యత కలిగిన పనుల పూర్తిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంటుంది. ఇక ప్రాధాన్యతాపరమైన అభివద్ధి పనుల అంశంపై ప్రభుత్వానికి లేఖరాసి ముందస్తు అనుమతి పొంది పనులు చేపట్టే అవకాశం ఉందా అన్న అంశంపై అధికార వర్గాలు దృష్టి సారించాయి. మొత్తం మీద ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందే వరకు అనంతపురం నగరంలో అభివద్ధి పనులు పడకేసినట్లేనని గుత్తేదారులు, కార్పొరేట్ల వర్గాలు చర్చించుకుంటున్నాయి.

విద్యుత్ సమస్యలు రానీయొద్దు : దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నియోజకవర్గంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని క్యాంపు కార్యాలయ ంలో విద్యుత్, మున్సిపల్, ఎస్‌హెచ్‌పిఆర్ అధికారు లతో సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటం.. కొన్ని కాలనీల్లో విద్యుత్ తీగలు కింద వరకు ఉండటం వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తున్నాయని.. వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించా రు. అలాగే వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో లోడ్ ఎక్కువగా ఉంటుందని.. అందుకనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు ఉండాలన్నారు. అలాగే విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. స్థలంతో పాటు ఇతర అనుమ తులు వంటి వాటిపై దృష్టి సాధించాలన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు ఉన్నచోట విద్యుత్ సమస్యలు రాకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఎలక్ట్రికల్ ఇఇ జెవి.రమేష్, ఎస్‌హెచ్‌పిఆర్ ఎఇ సుజిత, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, టిపిఒ శిరీషా, మున్సిపల్ అధికారులు శ్రీనివాసులు, విద్యుత్ అధికారులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

మున్సిపాలిటీలో పని చేస్తున్న రెగ్యులర్, అవుట్ సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కార్మికులతో కలిసి మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, కమిషనర్ బి.దివాకర్‌రెడ్డిలను కలిసి వినతి పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ మృతి చెందిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వాలని, కార్మికులకు పనిముట్లు, పరికరాలు సకాలంలో అందించాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు టిఎ, డిఎ, రెగ్యులర్ కార్మికులకు సరెండర్ లీవులు, పంప్ హౌస్ వద్ద పని చేసే ఇంజినీరింగ్ కార్మికులకు పరికరాలు ఇవ్వాలని కోరారు. కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరిం చాలని, లేనిచో ఈ నెల 28వ తేదీ మున్సిపల్ కార్యాలయం ముందు పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ ఛైర్‌పర్సన్, కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో బిటిపి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తాం

◆డిసెంబర్‌లో ఆయకట్టు రైతుల సమావేశం ◆ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రానున్న ఐదేళ్ల కూటమి ప్రభుత్వ పాలనలో జీడిపల్లి నుంచి బిటి ప్రాజెక్టుకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేస్తామని రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. బిటిపి రిజర్వాయర్ నీటితో నిండిన నేపథ్యంలో గురువారం నాడు రిజర్వాయర్ వద్ద కళ్యాణదుర్గం శాసనసభ్యులు అమిలినేని సురేంద్రబాబుతో కలిసి వేదవతికి గంగపూజ చేశారు. కుడి, ఎడమ కాలువ గేట్లు ఎత్తి చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ ఆరు దశాబ్దాల క్రితం నిర్మించిన బిటిపి ఆయకట్టు భూములు నీరు లేక బీళ్లు పడ్డాయన్నారు. 70 శాతం ఆయకట్టు ప్రాంత ప్రజలు వలస వెళు తున్నట్లు చెప్పారు. ఇటీవల వేదవతి నది పరివాహక ప్రాంతం కర్నాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురియడంతో బీటీపీలో రెండు టిఎంసిల నీటితో నిండి రిజర్వాయర్ కళకళలాడుతోందన్నారు. డిసెంబర్ నెలలో ఆయకట్టు రైతుల సమావేశం ఏర్పాటు చేసి కుడి, ఎడమ కాలువల ద్వారా బ్రహ్మసముద్రం, గుమ్మగట్ట మండలాల్లోని ఆయకట్టు భూములకు రబీకి పంటకు సాగునీరు అందిస్తామన్నారు. బిటిపికి శాశ్వతంగా కృష్ణ జలాలు అందించేందుకు 2018 సంవత్సరంలో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.968 కోట్లు నిధులు మంజూరు చేయగా 30 శాతం పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. అనంతరం రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలో వచ్చి ఐదేళ్లు ఉన్నప్పటికీ ఒక మీటర్ కాలువ కూడా తవ్వలేదన్నారు. తాము సిఎం చంద్రబాబును కలిసి బిటిపి ఆయకట్టుకు శాశ్వత నీటి వసతి కల్పించడంతోపాటు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 114 చెరువులకు, రాయదుర్గంలో నియోజకవర్గంలో చెరువులకు సాగునీరు అందించే ఎత్తిపోతల పథకం చేపట్టమని ముఖ్యమంత్రి కోరతామన్నారు. బుధవారం జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశంలో హంద్రీనీవా పథకానికి 2000 కోట్ల రూపాయలు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కృష్ణా జలాల ఎత్తిపోతల పథకం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ గుమ్మగట్ట మండల కన్వీనర్ గిరి మల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, రాయదుర్గం పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మండల కన్వీనర్ హనుమంతు, డి హిరేహాల్ మండల కన్వీనర్ హనుమంత రెడ్డి, జల వనరుల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణ నాయక్, డిఈ బలరాముడు, ఏఈ సాయిరాం, గుమ్మగట్ట సర్పంచి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బిటిపి నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని

కళాశాలకు వెళ్లకుండానే వేతనాలు..!

ప్రజాశక్తి-బొమ్మనహాల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లు(అతిథి అధ్యాపకులు) కళాశాలకు వెళ్లకుండానే వేతనాలు పొందుతున్నట్లు సమాచారం. ఇద్దరు గెస్ట్ లెక్చరర్లు అనంతపురం నగరంలో డీఎస్సీ శిక్షణ పొందుతూ ప్రతి నెలా రూ. 10 వేల చొప్పున 5 నెలల నుంచి వేతనాలు డ్రా చేసినట్లు తెలుస్తోంది. వివరాలు.. స్థానిక విన్సెంట్ ఫెర్రర్ జూనియర్ కళాశాలలో మొత్తం 8 మంది గెస్ట్ లెక్చరర్లు పని చేస్తున్నారు. ఇందులో ఇద్దరు గత జూన్ నుంచి అక్టోబర్ వరకూ కళాశాలకు హాజరుకావడం లేదు. వారు అనంతపురం నగరంలోని ఓ ప్రయివేటు ఇనిస్టిట్యూట్‌లో డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్నట్లు సమాచారం. అయినా వారు కళాశాల నుంచి ప్రతి నెలా వేతనాలు డ్రా చేస్తున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ఆ ఇద్దరు గెస్ట్ లెక్చరర్లు విధులకు హాజరుకాకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటంతో పాటు ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకోవడం దారుణమని మండిపడ్డారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ప్రిన్సిపల్‌తో పాటు ఆ ఇద్దరు గెస్ట్ లెక్చరర్లపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

జిల్లా అధ్యక్షుడు వై.మధుసూదన్ రెడ్డి

ప్రజాశక్తి- కళ్యాణదుర్గం రూరల్

కాంగ్రెస్‌పార్టీని గ్రామాల్లో బూత్ లెవెల్ నుంచి బలోపేతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు వై.మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి వెంకట నరసింహులు, కోటా సత్యం, తదితర జిల్లా నాయకులు హాజర య్యారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ బలోపేతం, కార్యకర్తల మధ్య సమస్యల పరిష్కారంపై చర్చించారు. సమావేశంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాల ఎర్రిస్వామి, చల్లపల్లి వీరయ్యచౌదరి, ఫక్రుద్దీన్‌సాబ్, రాంభూపాల్‌రెడ్డి, కొలిమి దాదాపీర్, కళ్యాణదుర్గం పట్టణ కన్వీనర్ బోయ నాగరాజు, కంబదూరు మండల కన్వీనర్ ఈరన్న, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కె.ఉద్దీప్‌సింహా, కుందుర్పి కాంగ్రెస్ నాయకులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెన్నానది కబ్జాదారులపై చర్యలు

ప్రజాశక్తి-పామిడి

పెన్నానది కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పెన్నానదిలో ఆక్రమణలను గుర్తించేందుకు గురువారం 6 టీములుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ టీములు వ్యవసాయం చేసుకోవడంతోపాటు ఇటుకుల బట్టీలు, రేకుల షెడ్డులు వేసుకుని ఉండటం వంటికి ఆక్రమణలో ఉన్నట్లు గుర్తించనున్నట్లు తెలిపారు. పెన్నానది ఆక్రమణలో పంటలు వేసిన రైతులు సర్వే చేసేటప్పుడు ఆక్రమణదారులు అందుబాటులో ఉండటం లేదన్నారు. ఏదిఏమైనా ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పంటల సస్యరక్షణపై శిక్షణ

పామిడి : మండల కేంద్రంలోని రైతు సేవాకేంద్రంలో పంటల సస్యరక్షణపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా రీసోర్స్ సెంటర్ పీడీ ఆత్మా మద్దిలేటి క్రాప్ లైఫ్ సిస్టం అనే ఆన్‌లైన్ యాప్ ప్రాముఖ్యత, అప్లికేషన్ ఉపయోగించడం ఎలా అనే అంశాలపై వివరించారు. అలాగే ప్రధాన పంటల్లో వచ్చే చీడపీడలు పురుగుల వల్ల కలిగే నష్టాలు, వాటిని గుర్తించడం మొదలగు ముఖ్యమైన అంశాలను వివరిస్తూ మానిటర్ ద్వారా డిస్ప్లే చేసి చూపిస్తూ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లీనా వసుంధర, ఎఇఒ శ్రీనివాసరావు, ప్రసాద్, విఎఎలు, విహెచ్‌ఎలు, విఎస్‌ఎలు, ఎంపిఇఒలు, శ్రీకాంత్, రామాంజనేయులు, చిరంజీవి, ఆదినారాయణ, చందన, తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

టపాసుల విక్రయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

టపాకాయల విక్రయ దుకాణదారులు సురక్షాపరమైన జాగ్రత్తలు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ ఆదేశించారు. దీపావళి పండుగ సందర్భంగా గురువారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో టపాకాయల విక్రయ దుకాణదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ దీపావళి పండుగ సందర్భంగా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజినల్ అధికారులకు తెలిపారు.ఈ సమావేశంలో డిఆర్‌ఓ రామకృష్ణారెడ్డి, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్ కుమార్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోండి : ఎమ్మెల్యే సునీత



నీటమునిగిన ఉద్యానవన పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సత్యసాయి జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అనుకోకుండా వచ్చిన వరదలతో రాప్తాడు నియోజకవర్గంలో పంటలకు అపార నష్టం వాటిల్లిందని, చాలామంది ఇళ్లు కోల్పోయారని వారందరినీ ఆదుకోవాలని ఎమ్మెల్యే పరిటాల సునీత కలెక్టర్ టిఎస్.చేతన్‌ను కోరారు. రాప్తాడు నియోజకవర్గంలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కనగానపల్లి మండల కేంద్రంలో చెరువు తెగిపోయింది. తెగిన చెరువు కట్ట, నీట మునిగిన పంట పొలాలను కలెక్టర్, ఎమ్మెల్యేలు గురువారం పరిశీలించారు. గ్రామస్తులు, రైతులతో మాట్లాడి నష్టం వివరాలను తెలుసుకున్నారు. కనగానపల్లి చెరువు మరమ్మతులకు రూ.50 లక్షల వరకు ఖర్చు అవుతుందని ఈ నిధులు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో భారీ వర్షాలు వరదల కారణంగా వేలాది ఎకరాల్లో పంటలను రైతులు నష్టపోయారన్నారు. వీటన్నింటికీ పరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రెడ్డివారికుంట కెపాసిటీ మొత్తం 21 వేల క్యూసెక్కులు అన్నారు. ఒక్కసారిగా 30వేల క్యూసెక్కుల నీరు రావడంతో కట్ట తెగిపోయిందన్నారు. కనగానపల్లి మండలంలో 188 మిల్లీమీటర్ల వర్షం కురిసిందన్నారు. దీని వల్లే చెరువు కట్ట తెగినట్లు వివరించారు. మరమ్మతులకు సంబంధించి ఇరిగేషన్ శాఖ అధికారులకు తగిన ఆదేశాలిచ్చామన్నారు. శాశ్వత ప్రాతిపదికన చెరువుకు మరమ్మత్తులు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, జలవనరుల శాఖ ఎస్ఈ విశ్వనాధ్, ఉద్యానవన శాఖ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రాంతీయ రవాణాశాఖ అధికారిగా ఎస్.రమేష్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్



ఎస్.రమేష్

కళ్యాణదుర్గం ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయానికి మొట్టమొదటి ప్రాంతీయ రవాణా శాఖ అధికారిగా ఎస్.రమేష్‌ను ప్రభుత్వం ఇటీవల నియమించింది. ఆయన గురువారం నాడు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతీయ రవాణా శాఖ అధికారి కార్యాలయం పరిధిలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు కృషి చేయనున్నట్లు చెప్పారు. వాహనాల టాక్స్‌ను ప్రభుత్వ నిర్దేశాల ప్రకారం వసూలు చేస్తామన్నారు.

'ఉపాధి' పనులపై సమీక్ష

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని డ్వామా కార్యాలయంలో గురువారం పిడి సలీంబాషా ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతి, పని దినాలు, తదితర విషయాలపై సమీక్ష జరిపారు. సమావేశంలో రాయదుర్గం క్లస్టర్ పరిధిలోని ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కెవికెలో విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

పట్టణంలోని ఎస్‌విజిఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు గురువారం కృషి విజ్ఞాన కేంద్రంలో పర్యటించారు. రెండో రోజు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా విద్యార్థులు రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యాన పంటల శాస్త్రవేత్త డాక్టర్ యుగంధర్ కూరగాయల సాగులో సస్యసరక్షణ చర్యలను విద్యార్థులకు వివరించారు. కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఈ.చెన్నయుడు వ్యవసాయంలో ఆధునిక పద్ధతులపై రైతులకు ఎలా అవగాహన కల్పిస్తారో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎంవి.శేషయ్య, డాక్టర్ శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గురువారం అసిస్టెంట్ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్డీవో బి.వినూత్న ఆధ్వర్యంలో అంగన్వాడీ ఆయా పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కళ్యాణదుర్గంలో ప్రాజెక్టు పరిధిలోని 6 అంగన్వాడీ సెంటర్లకు సంబంధించి ఆరుగురు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం

అర్థాంతరంగా ముగిసిన చర్చలు



కార్మికుల సమస్యలపై మున్సిపల్ పాలకవర్గం, అధికారులతో చర్చిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారంపై సిఐటియు అనుబంధ మున్సిపల్ యూనియన్ నాయకులతో పాలకవర్గం, కమిషనర్‌తో గురువారం జరిపిన చర్చలు అర్థాంతరంగా ముగిశాయి. సమావేశానికి హాజరైన మేయర్ వసీం, కమిషనర్ నాగరాజు, డిప్యూటీ మేయర్లు విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లుతో ఇంజినీరింగ్, ఎన్ఎంఆర్, కోవిడ్, మలేరియా, గార్బేజీ, క్లాప్, అదనపు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్మిక సంఘం నాయకులు ప్రస్తావించారు. ముఖ్యంగా రెగ్యులర్ కార్మికులకు యూనిఫామ్, పనిముట్లు, రక్షణ పరికరాలు, బకాయి సరెండర్ లీవ్ అమౌంట్ ఇప్పించాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికులకు 2011లో 9 నెలలు బకాయి ఉన్న ఈపీఎఫ్ అమౌంట్ ను వెంటనే ఖాతాలో జమ చేయాలన్నారు. వాటర్ వర్క్స్‌లో పని చేస్తున్న కార్మికులకు టిఎ, డిఎలు అమలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని, చనిపోయిన కార్మికుల స్థానంలో కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని, డెత్ బెనిఫిట్స్, ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. పనిముట్లు రక్షణ పరికరాలు, మెనూ పద్ధతిలో సకాలంలో అందజేయాలన్నారు. వీటితోపాటు పలు సమస్యలను అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకొచ్చారు. అయితే ఆయా సమస్యలను వినీవిననట్టుగా వ్యవహరించడంతోపాటు సరైన స్పష్టతతో కూడిన హామీలు ఇవ్వకపోవడంతో చర్చలు అర్థాంతరంగా ముగిశాయి. ఈ సమావేశంలో సిఐటియు 1వ, 2వ నగర ప్రధాన కార్యదర్శులు వెంకటనారాయణ, ముర్తుజా, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎటిఎం నాగరాజు, కె.నాగభూషణ, జిల్లా కోశాధికారి బత్తల ఆదినారాయణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారు ఎర్రిస్వామి, సాకే.తిరుమలేష్, రెగ్యులర్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎం.నల్లప్ప, ఎల్.ముత్తురాజు, కమిటీ సభ్యులు ఆనంద్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మండల మీట్‌లో సమస్యలు ఏకరువు



సమావేశంలో సమస్యలను లేవనెత్తుతున్న నాయకులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల అధ్యక్షులు నాగేశ్వర రావు అధ్యక్షతన ఎంపిడిఒ గంగావతి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ముందుగా పలువురు ఎంపిటిసిలు మాట్లాడు తూ గత సర్వసభ్య సమావేశంలో స్వయానా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ సమక్షంలో పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఇప్పటి వరకూ పరిష్కరించిన పాపానపోలేదన్నారు. ఇందుకు జడ్పిటిసి నాగరత్నమ్మ కల్పించుకుని గత సమావేశంలో ఉన్న అధికారులు బదిలీ అయ్యారని, ప్రస్తుతం సాధారణ బదిలీల్లో భాగంగా తహశీల్దార్, ఎంపిడిఒ నూతనంగా వచ్చారన్నారు. కావున గత సమస్యలను పక్కన పెట్టి ప్రస్తుతం ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో చెబితే వచ్చే సమావేశానికి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తర్వాత మండల కేంద్రంలోని క్రాసింగ్ సమీపంలో ఉన్న ఇందిరమ్మ లేఅవుట్‌లో చాలామంది అర్హత లేని వారికి ఇంటి పట్టాలు పంపిణీ చేశారని, వారిపై విచారణ చేపట్టాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. దీంతో కొదిసేపు తహశీల్దార్ అరుణకుమారి, వామపక్ష నాయకులు మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పలువురు సభ్యులు కల్పించుకుని గొడవతో సమయాన్ని వృథా చేయవద్దని, సమస్యలపై చర్చించాలని చెప్పడంతో శాంతించారు. అనంతరం వివిధ శాఖల అధికారులు వారి శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఈ సమావేశంలో ఉపమండల అధ్యక్షుడు మల్లేశ్వరయ్య, మండల విద్యాధికారి కృష్ణయ్య, ఇఒఆర్‌డి శైలజారాణి, ఎంపిటిసిలు శంకర్‌యాదవ్, రాజారెడ్డి, పద్మాకర్‌రెడ్డి, కాటమయ్య, శారద, సర్పంచులు సుప్రియ, రమణకుమారి, రాంభూపాల్‌రెడ్డి, రామాంజనేయులు, కుళ్లాయిరెడ్డి, రామంజినమ్మ, వైద్యులు ప్రవీణ్‌కుమార్, మహేంద్ర, సిహెచ్‌ఒ బాలాజీ, వ్యవసాయశాఖ అధికారి చెన్నవీరస్వామి, వార్డెన్లు విజయ్‌కుమార్, తులసి, ఉపాధి హామీ ఎపిఒలు యర్రమ్మ, రమేష్, రామారావు, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు సంతాపం



మృతదేహం వద్ద సాంబశివారెడ్డి

శింగనమల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు రైతుల మృతదేహాలను వైసిపి నేత ఆలూరు సాంబశివారెడ్డి గురువారం అనంతపురంలోని పెద్దాసుపత్రిలోని మార్చురీలో పరిశీలించారు. అనంతరం అక్కడే ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన అట్టే రమణ (50), పేట నాగేశ్వరరెడ్డి (53) బుధవారం జరిగిర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న ఆలూరు సాంబశివారెడ్డి పెద్దాసుపత్రికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి కుటుంబ సభ్యులతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతోపాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి వీరాంజనేయులు, సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

శింగనమల : రీసర్వే వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో సభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. గురువారం మండల పరిధిలోని నిదనవాడ గ్రామంలో భూ సమస్యలపై రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు రీసర్వే చేసిన గ్రామాల్లో రెవెన్యూతోపాటు సర్వే సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, ఆర్ఐ హనుమాన్‌ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, సర్వేయర్లు, వీఆర్వోలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

అనంతపురం రూరల్ : అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏడుగురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.11.70లక్షల చెక్కులను గురువారం స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం విషయంలో పార్టీలు, రాజకీయాలు చూడమన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నా, ప్రజారోగ్యం విషయంలో మాత్రం చంద్రబాబు ఉదారంగా ఉన్నారు. ఇందులో భాగంగానే నాలుగు నెలల్లో అర్బన్ నియోజకవర్గంలో రూ.35 లక్షలు సిఎంఆర్ఎఫ్ కింద సాయం అందించామన్నారు.

శింగనమల చెరువు తూములకు మరమ్మతులు చేయాలి

శింగనమల : మండల కేంద్రంలోని శ్రీరంగరాయల చెరువు మరవతోపాటు తూములకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఓబిసి ఛైర్మన్ రామ్‌చరణ్‌యాదవ్ కోరారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు కట్ట పూర్తిగా కంపచెట్లతో నిండిపోయిందన్నారు. అక్కడక్కడ తూములు, మరువ వద్ద లీకులు అవుతున్నాయన్నారు. కావున వెంటనే స్పందించి చెరువు తూములతోపాటు మరువ వద్ద మరమ్మతులు చేయాలని కోరారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

యాడికి : అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధిలోని కోన ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా 121 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 11 మందికి కంటి అవసరం ఉన్నట్లు గుర్తించారు. 18 పిల్లలకు ఉచితంగా కంటి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి డివిజన్ జిపిఎంఒ మధుసూదన్‌రాజు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు ఎల్ఎస్.పవన్ కుమార్, పీడీ ఎల్.చిన్నఓబులు పాల్గొన్నారు.

పెద్దపేటలో అధికారుల పర్యటన

యాడికి : మండల పరిధిలోని పెద్దపేట గ్రామంలో అధికారులు పర్యటించి పలు సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా రోడ్లు, డ్రెయినేజీ, పైప్‌లైన్ లీకేజీ వంటి సమస్యలను పరిశీలించారు. ఆంజనేయస్వామి కాలనీలో ఆరునెలలుగా పైప్‌లైన్ లీకేజీ సమస్యను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో నీరు వృథాగా పోతోందని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆయా సమస్యలను రెండు రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పీర్లచావిడి వద్ద రోడ్డుపై మురుగునీరు ప్రవహించకుండా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, ఎండిడిఒ వీరరాజు, ఇఒఆర్‌డి శశికళ, సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్ ఫెమినా, తదితరులు పాల్గొన్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనపై అవగాహన

యాడికి : జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని విజన్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, మందమైన, మెరిసే జిడ్డుగల చర్మం, అరచేతులు, అరికాళ్లలో స్పర్శ లేకపోవడం, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, చేతివేళ్లు, కాలి వేళ్లు వంకర తిరిగి, అంగవైకల్యం రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, విజన్ స్కూల్ కరస్పాండెంట్ విశ్వనాథ్, విజన్ పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకే పోటీలు

ఉరవకొండ : విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను పెంపొందించేందుకే నిస్వార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖ అధికారి ఈశ్వరప్ప తెలిపారు. ఈమేరకు గురువారం నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షులు తాటికొండ వెంకట్ ఆధ్వర్యంలో స్థానిక ఉపాధ్యాయులతో ఇందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని విద్యార్థులకు ప్రతి ఆదివారం, రెండవ శనివారం ఉరవకొండలోని శ్రీ కరిబసవ స్వామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు నవంబర్ 14న ప్రశంసాపత్రం, షీల్డ్, మెడల్ అందజేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్..99634 98250 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నగరంలో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపురంలో అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాలని మహమ్మద్ వసీం సూచించారు. గురువారం నగరపాలక లోని మేయర్ ఛాంబర్‌లో ఉప మేయర్లు వాసంతి, విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలు ఉండడంతో అప్పట్లో ఎన్నికల విధుల వల్ల కొన్ని పనులు జరగడంలేదని, ఎన్నికలు అయిపోయిన తర్వాత అధికారులు ఇంజనీరింగ్ అధికారుల బదిలీల వల్ల నగరంలో అభివృద్ధి పనులు ఆగిపోయాయన్నారు. ప్రస్తుతం అధికారులు పూర్తి స్థాయిలో ఉన్న నేపథ్యంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు, అడిషనల్ కమీషనర్ రామలింగేశ్వర, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఇ భాస్కరరావు, ఇఇలు రాధాకృష్ణ, షాకీర్‌హుస్సేన్, డిఇలు సుభాష్‌చంద్రబోస్, దాక్షాయిని, రాజేష్, నరసింహమూర్తి, కార్పొరేటర్లు అబూసలేహా, కమల్‌భూషణ్, వెంకటరమణ, ఇఎలు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

యల్లనూరు : మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వాసుదేవరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధ్యక్షులు, జిల్లా పరిషత్ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులతోపాటు ప్రొటోకాల్ ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుకిరువైపులా కంపచెట్లు తొలగింపు

శింగనమల : టిడిపి ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని మరువకొమ్మ వద్ద నుంచి గోవిందరాయనపేట గ్రామం వరకూ రోడ్డుకిరువైపులా కంపచెట్లను తొలగించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలకుమారి, సర్పంచి నాగమునెమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అంధుల ఆదర్శ వివాహం



అంధులను ఆశీర్వదిస్తున్న ఎంపీ అంబికా, తదితరులు

ప్రజాశక్తి-అనంతపురం

డి.హీరేహాల్ మండలం మురడి గ్రామానికి చెందిన అంధుడు లోకేష్, తెలంగాణ రాష్ట్రం కొమరంభీమ్ జిల్లా అచ్చల్ల గ్రామానికి చెందిన రాథోడ్ సునీతకు సాయిట్రస్టు ఆధ్వర్యంలో గురువారం తపోవనంలోని చిన్మయ జగదీశ్వరాలయంలో వివాహం నిర్వహించారు. మొదట సీతారాములకు పూజలు చేశారు. అనంతరం దేవరకొండ బాలాజీశర్మ ఆధ్వర్యంలో అంధులకు వివాహం జరిపించారు. వివాహానికి ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, చిన్మయ మిషన్ ఆత్మ విధానంద, మేయర్ వసీం సలీం, డిప్యూటీ మేయర్ వాసంతిసాహిత్య, బిజెపి నేత వెంకటేశ్వరరెడ్డి, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి కుమార్ మాట్లాడుతూ ట్రస్టు ద్వారా ఇప్పటి వరకూ 102 మందికి వివాహాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిసంస్థ జిల్లా అధ్యక్షులు జయంతి శ్రీనివాసులు, ఆపద్బంధు సహాయ ట్రస్టు ఉపాధ్యక్షులు శంకరప్ప, సత్యసాయి లింగమయ్య, గోపాల్, వలిస్వామి, ఆశ్రమం జయచంద్రారెడ్డి, ఎస్‌కెయు ప్రొఫెసర్ సిఎస్.రాయుడు, ఆలయ సభ్యులు రామాంజి, మురళి, సాయిసంస్థ సభ్యులు రాఘవేంద్ర, నారాయణనాయక్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులకు టెండర్లు

అనంతపురం : రోడ్లు, రహదారుల శాఖ పరిధిలో గుంతల రహదారులు మరమ్మతులు చేసేందుకు 44పనులకు టెండర్లను పిలిచినట్లు అనంతపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడిపత్రి నియోజకవర్గానికి 18 పనులకు రూ.39లక్షలు, శింగనమల నియోజకవర్గానికి 9 పనులకు రూ.2.40కోట్లు, గుంతకల్లుకు 8 పునలకు రూ.63.50లక్షలు, అనంతపురానికి 2 పనులకు రూ.54, రాప్తాడుకు 4 పనులకు రూ.79.50, ఉరవకొండకు 3 పనులకు రూ.4.40కోట్లు నిధులతో టెండర్లు పిలిచినట్లు తెలిపారు. నవంబర్ 8వ తేదీ తర్వా టెండర్లు ఖరారు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు.

హెడ్ కానిస్టేబుల్ అంత్యక్రియలు

అనంతపురం క్రైం : అనారోగ్యంతో మతి చెందిన పుట్లూరు హెడ్ కానిస్టేబుల్ నరసింహమూర్తి అంత్యక్రియలు గురువారం స్వగ్రామం కంబదూరులో నిర్వహించారు. గత కొన్నాళ్లుగా ఇతను అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం చనిపోయాడు. దీంతో మృతదేహాన్ని కంబదూరుకు తరలించి అక్కడి శ్మశానవాటికలో ఈరోజు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేశారు. అంత్యక్రియల్లో పుట్లూరు హేమాద్రి, ఎఎస్ఐ రాజశేఖర్, కంబదూరు ఎఎస్ఐ ఓబుళపతి, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, లక్ష్మీనారాయణ, మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, బ్యాచిమేట్లు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు పిల్లలకు వ్యాసరచన పోటీలు

అనంతపురం క్రైం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాలతో గురువారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు పిల్లలకు సెమినార్లు, వ్యాసరచనలు, నిర్వహించారు. అలాగే 'సైబర్ నేరాల నివారణలో యువత పాత్ర'పై పోటీలు జరిగాయి. వ్యాసరచన, సెమినార్లలో ప్రతిభ చూపిన పోలీసు పిల్లలను గుర్తించి త్వరలో వీరికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఎస్ఐలు రమేష్‌నాయక్, మగ్బూల్, ముస్తఫా, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

పెద్దవడుగూరు : పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎస్ఐ ఆంజనేయులు కొనియాడారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలు నివారణలో యువత పాత్ర అనే అంశంపై రాత పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సమాజం శాంతియుతంగా కొనసాగాలంటే పోలీసు తన విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయాన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌సిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

గుత్తి : మండలంలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టామని గుంతకల్లు డీఎస్పీ ఆముదాల శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల పరిధిలోని కొత్తపేట, ఊబిచెర్ల గ్రామ మలుపు, బాటసుంకలమ్మ ఆలయం సమీపంలోతోపాటు 67,44వ జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగే స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ కె.సురేష్ బాబు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సిఐ శేఖర్‌ను కలిసిన జెఎసి నేతలు

అనంతపురం : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతపురం రూరల్ సిఐ శేఖర్‌ను పోలీస్‌స్టేషన్‌లో ఎపి స్టూడెంట్ జెఎసి నేతలు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమొక్క అందజేసి సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సిఐను కలిసిన వారిలో స్టూడెంట్ జెఎసి జిల్లా అధ్యక్షులు అమర్‌యాదవ్, అభిరామ్, నరేష్, భరత్, గజేంద్ర, దీక్షిత్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువ న్యాయవాది అనుమానాస్పద మృతి



రుక్సానా (ఫైల్‌ఫొటో)

అనంతపురం క్రైం : అనంతపురంలో యువ మహిళా న్యాయవాది అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... శ్రీసత్యసాయి జిల్లా బుక్కపట్నం మండలం రాంపురం గ్రామానికి చెందిన రుక్సానా (27) అనంతపురంలో ఓ న్యాయవాది వద్ద జూనియర్ న్యాయవాదిగా పని చేస్తోంది. కోర్టు రోడ్డులో నివసిస్తున్న ఆమె తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలాన్ని పరిశీలింగా అక్కడి పరిస్థితులు అనుమానంగా ఉండడంతో ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. నేరస్థలం, ఇంటి నుంచి ఆమె వచ్చిన ప్రతి విషయాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. యువ మహిళా న్యాయవాది మృతిపై న్యాయవాద సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఘటనపై త్వరితగతిన సమగ్ర విచారణ జరిపించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

దానిమ్మ చెట్లు నరికివేత

పుట్లూరు : మండల పరిధిలోని కందికాపుల గ్రామంలో రైతు నారాయణస్వామికి చెందిన దానిమ్మ చెట్లతోపాటు మోటార్ వైర్లను బుధవారం రాత్రి గుర్తు తెలియని దండగులు నరికివేశారు. నారాయణస్వామి రాత్రి తోట వద్ద కాపలా ఉండగా అర్ధరాత్రి ఎవరో చెట్లు నరకుతున్నట్టు గమణించి కేకలు వేశాడు. దీంతో దండుగులు పారిపోయారు. ఉదయం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నరికిన చెట్లు, మెటారు వైర్లను పరిశీలించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో చోరీ

గుత్తి : మండలంలోని గాజులపల్లి గ్రామ సమీపంలో ఉన్న చంద్రమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తలుపులు బద్దలు కొట్టి లోనికి ప్రవేశించి 80 తులాల అమ్మవారి కిరీటంతోపాటు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. అలాగే హుండీని పగలు కొట్టి రూ.40వేలు నగదును దోచుకున్నారు. గురువారం ఉదయం అర్చకుడు ఆలయాన్ని సందర్శించగా తలుపు తెరిచి ఉండడంతో స్థానికులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

మండలంలోని మెచ్చిరి గ్రామానికి చెందిన కొత్తపల్లి ఆదికేశవులు హత్య కేసులో ఎ-8 నిందితుడైన చెన్నారెడ్డిని గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ జయనాయక్ తెలిపారు. కొత్తపల్లి ఆదికేశవులును గత జులై 9వ తేదీ రాత్రి దుండగులు హత్య చేశారు. ఆ కేసులో చెన్నారెడ్డి నిందితుడని సిఐ తెలిపారు.

జిల్లావ్యాప్తంగా మట్కా, పేకాట స్థావరాలపై దాడులు



యల్లనూరులు మట్కా నిర్వాహకుడి వివరాలు వెల్లడిస్తున్న సిఐ సత్యబాబు

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు గురువారం మట్కా, పేకాట స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా బుక్కరాయసముద్రం, తాడిపత్రి అర్బన్, పెద్దపప్పూరు, గుంతకల్లు వన్‌టౌన్ పోలీసులు వేర్వేరుగా దాడులు నిర్వహించి మట్కాకు సంబంధించి 4 కేసులు నమోదు చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.3,40,190 నగదు సీజ్‌చేశారు. అలాగే కళ్యాణదుర్గం రూరల్, శెట్టూరు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్ పోలీసులు వేర్వేరుగా దాడులు చేపట్టి పేకాటకు సంబంధించి 4 కేసులు నమోదు చేసి 29 మందిని అరెస్టు చేసి రూ.1,40,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించని వారిపై, ట్రిపుల్ డ్రైవింగ్, ఓవర్ లోడింగ్, డ్రంకన్ డ్రైవింగ్, తదితర రోడ్డు భద్రతా ఉల్లంఘనదారులపై మోటారు వాహనాల చట్ట ప్రకారంగా 365 కేసులు నమోదు చేశారు. రూ. 1,08,310 అపరాద రుసుం విధించారు. బహిరంగ ప్రదేశల్లో మద్యం తాగి, ప్రజా శాంతికి భంగం కలిగించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 54 ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు చేశారు. వీటితో పాటు మద్యం సేవించి వాహనాలు నడిపిన వాహన చోదకులపై 14 కేసులు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, అర్ధరాత్రి వేళల్లో అనుమానాస్పందంగా సంచరిస్తున్న అపరిచితులు 125 మందిని తనిఖీలు చేసి 12 మందిని పోలీసుస్టేషన్లకు తరలించారు. జిల్లావ్యాప్తంగా వాహనాల తనిఖీలు చేపట్టి 518 వాహనాలను చెక్ చేశారు. గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా, తదితరాలు అక్రమ రవాణా జరుగకుండా క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అదేవిధంగా 161 ఎటిఎం కేంద్రాలను తనిఖీ చేసి భద్రతపై సమీక్షించారు.

తాడిపత్రి : తాడిపత్రి పట్టణంలో పోలీసులు వరుసగా దాడులు నిర్వహిస్తూ మట్కా నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని నందలపాడులో అర్బన్ సి.ఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మట్కా నిర్వహిస్తున్న చుక్కలూరు చాంద్‌బాషాను అరెస్టు చేసి రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

యల్లనూరు : మండల పరిధిలోని గొడ్డుమర్రి గ్రామం మలుపు వద్ద మట్కా నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సిఐ సత్యబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. గొడ్డుమర్రి మలుపు వద్ద మట్కా నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో ఎస్ఐ జి.శ్రీరామప్రసాద్ సిబ్బంది వెళ్లి దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో మట్కాకంపెనీ నిర్వహిస్తున్న తిమ్మంపల్లి గ్రామానికి చెందిన నాగేంద్రశెట్టిని వెంబడించి పట్టుకున్నట్లు వివరించారు. నిందితుడి నుంచి మట్కా చీటీలతోపాటు రూ.30,200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట, ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ముఖ్యంగా యువత అశాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ సంపత్, జమేదారు శంకర్‌నారాయణ, పోలీసులు అక్కులప్ప, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.